ఆలయాల ముస్తాబు

- నేడు శ్రీరామనవమి..
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- సీతారాముల కల్యాణ వేడుకలకు భారీగా తరలిరానున్న భక్తులు


మాధవనగర్‌లోని సాయిబాబా ఆలయంలో అందంగా అలంకరించిన విగ్రహాలు


విద్యుత్ దీపాల కాంతుల్లో వెలిగిపోతున్న సుభాష్ నగర్ రామాలయం

నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని కోదండ రామాలయాలు శ్రీరామ నవమి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ దీప కాంతులతో అందంగా ఆలయాలను అలంకరించారు. ఈ సందర్భంగా నేడు సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండవగా నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీలు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు ఆలయాల వద్ద అన్నదానంతో పాటు భక్తులకు బెల్లం పానకం, వడ పప్పు, ప్రత్యేకంగా తయారు చేసిన లడ్డూలు అందించనున్నారు. జిల్లాలోనే చారిత్రక ప్రసిద్ధి చెందిన డిచ్‌పల్లి, నగరంలోని ఖిల్లా రామాలయం, బడా రాంమందిర్, పోచంపాడ్ రామాలయం, సుభాష్‌నగర్ కోదండ రామాలయాలకు శ్రీరామనవమి సందర్భంగా భక్తులు పోటెత్తనున్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఖిల్లా రామాలయంలోని మండపం


ఖిల్లా రామాలయంలో సీతారాముల ప్రతిమలు


సుభాష్‌నగర్ రామాలయంలో..


శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బడా రాంమందిరంలో భక్తులకు అన్నదానం


ఖిల్లా రామాలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు


ఖిల్లా ముఖద్వారం వద్ద హనుమంతుడి జెండా

క్లుప్తంగా

విచారణ జరిపించాలి

తెయూ(డిచ్‌పల్లి): బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి అర్వింద్ ఆత్మహత్యపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మంగళవారం డిమాండ్ చేశారు. ఏ యూనివర్సిటీలో లేని ఆత్మహత్యలు ఒక్క ట్రిపుల్ ఐటీలోనే ఎందుకు జరుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ప్రతి ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలను జోడిస్తూ వర్సిటీ ఉన్నతాధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. క్యాంపస్‌లో విద్యార్థి సంఘాలను అనుమతించడం లేదని విద్యార్థులతో మాట్లాడనివ్వకుండా చేస్తున్నారని విమర్శించారు. గతంలో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆందోళన చేపట్టినప్పుడు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గోడదూకి లోపలికి వెళ్లారని గుర్తు చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వర్ణామృత ప్రాశన మందు పంపిణీ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో 0 నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు మా పల్లె చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్వర్ణామృత ప్రాశన మందును పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు నగరం, ఇతర మండలాల నుంచి చిన్నారులతో తల్లిదండ్రులు తరలివచ్చారు. స్వర్ణామృత ప్రాశన మందు వేయించడం వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతోందని, మేధో సంపత్తి మెరుగుపడుతుందని ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. ప్రతినెల పుష్యమి నక్షత్రం రోజు దివ్యౌషధాన్ని పంపిణీ చేస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ఎంపీటీసీ రాములు, రవీందర్ యాదవ్, నరేందర్, నర్సారెడ్డి, రమేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాదిగ సమాజానికి క్షమాపణ చెప్పాలి

నిజామాబాద్‌అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ సమాజానికి క్షమాపణ చెప్పాలని మాదిగ సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి డిమాండ్ చేశాడు, మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలమూరు పార్లమెంటరీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాదిగ ఉద్యమం మీద, మాదిగ నాయకత్వం మీద చేసిన వ్యాఖ్యలను నిజామాబాద్ జిల్లా కమిటీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మూడు ఎస్సీ రిజర్వుడ్ పార్లమెంట్ స్థానాల్లో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వకుండా, అలాగే కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వుడ్ స్థానం కూడా మాదిగలకు ఇవ్వకుండా అవమానించారని అన్నారు. నాయకులు కనక ప్రమోద్ మాదిగ, మైలారం బాలు మాదిగ పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలన

డిచ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సీ అండ్ డీ ఈవీఎంలను భద్రపరచడానికి అవసరమైన స్ట్రాంగ్ రూంను నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ మంగళవారం పరిశీలించారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని పై అంతస్తు గదిని ఆయన పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు అనుగుణంగా గదిలో ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ ప్రభాకర్‌కు సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్‌తో పాటు డీటీ(ఎలక్షన్స్) శ్రీకాంత్, ఆర్ఐలు సంతోష్, ప్రభ తదితరులున్నారు.

బీసీ గళం వినిపించాలి

నిజామాబాద్‌నాగారం: స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా కూడా బీసీలకు తమ వాటా తమకు దక్కకపోవడం బాధాకరమని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం కేర్ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో దాదాపు 70 కోట్ల జనాభా ఉన్న బీసీలకు కేంద్రంలో ఇంత వరకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం హక్కులు కల్పించాలని, బీసీలకు సబ్ ప్లాన్ కావాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించండి

నిజామాబాద్ రూరల్: మండలంలోని పాంగ్రా శివారు, నగరంలోని 4వ డివిజన్ మాధవనగర్ కెనాల్ కట్ట మీద 25 సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు ఇప్పించాలని మంగళవారం రూరల్ తహసీల్దార్‌ను రైతు కూలీ సంఘం అధ్యక్షుడు గంగుల నర్సయ్య, పేదలతో కలిసి వేడుకున్నారు. ఈ మేరకు ఆయన వినతి పత్రం అందించారు. అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేయాలని గతంలో చాలాసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయినా ఇళ్ల పట్టాలు ఇంతవరకు అందలేదన్నారు. దీపిక, సత్యనారాయణ ఉన్నారు.

వైన్స్‌లు మూసి ఉంచాలి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వైన్స్‌లు, బార్లు, కల్లు డిపోలు శ్రీరామనవమి సందర్భంగా మూసి ఉంచాలని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం 6 గంటల వరకు మూసి వేయాలని ఆదేశించారు. లేకుంటే ఎక్సైజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడా రాంమందిర్‌లో డీఈవో పూజలు


బడా రాంమందిర్ ఉత్తరాధికారి సీతారామచంద్ర మూర్తితో డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్ సిటీ: శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ సోమవారం బడా రాంమందిరంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బడా రాంమందిర్ ఉత్తరాధికారి సీతారామచంద్ర మూర్తిని కలిసి ఆశీస్సులు పొందారు. గోశాలను సందర్శించి గోవులకు పశుగ్రాసం తినిపించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను డీఈవో తనిఖీ చేశారు. పాఠశాల హెచ్ఎం కృపాల్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఖలీల్ వాడి: నగరంలోని సత్యం, శివం, సుందరం అపార్ట్‌మెంటులో స్థానికులకు నిజామాబాద్ అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. సిలిండర్ నుంచి మంటలు వస్తే ఆర్పే విధానం, విద్యుత్ వైర్లు లూజ్ కలెక్షన్లు ఉంచుకోవద్దని, తెగిన వైర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేకుంటే షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందన్నారు. అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

ఆగస్ట్ 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తమ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండలం యానంపల్లి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ధాన్యం సేకరణ తీరును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. హమాలీలకు ఇస్తున్న కూలి, గన్నీ సంచులు, ధాన్యం సేకరణ, లారీల్లో రైస్‌మిల్లులకు తరలింపు వివరాలను సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, సీఈవో కిషన్‌లు ఎమ్మెల్యేకు వివరించారు. రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. మరో వారం రోజుల్లో వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. వడ్లు కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు లు వేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభు త్వం నుంచి రావాల్సిన బకాయిలు


యానంపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

రూ.1,200 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయన్నారు. ప్రస్తుతం రైతులకు ఏమాత్రం ఇబ్బంది లేదని, ఏమైనా ఫి ర్యాదులుంటే టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వవచ్చన్నారు. వచ్చే సీజన్ నుంచి రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. రైతు భరోసా 5 ఎకరాలకే పరిమితం చేశామని, సాగు చేసే రైతులు, కౌలు రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నా రు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్వీ అల్కలైన్ మినరల్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్, వైస్ చైర్మన్ గంగారాం, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ షాదుల్లా, న్యాస రాజేశ్వర్, పులి వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

సీఎంతోనే గల్ఫ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఖలీల్‌వాడి: సీఎం రేవంత్ రెడ్డితోనే గల్ఫ్ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గల్ఫ్ బాధితుల సమావేశం నిర్వహించగా.. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఈరవత్రి అనిల్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు చెందిన తాను నిత్యం గల్ఫ్ కార్మికుల వేదనలు, రోదనలు వింటూ పెరిగానన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాతైనా వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించానని అన్నారు. బొంబాయి, బొగ్గబాయి, దుబాయి అని ఉద్యమ సమయంలో మాట్లాడిన కేసీఆర్ కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ బాధితుల గోడు వినలేదని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో గల్ఫ్ బాధితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం కలుగుతోందన్నారు. వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిన సీఎంగా ఆయన చరిత్రలో నిలిచిపోవాలని కోరుకుంటున్నానని చెప్పారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ధర్పల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేయడానికి వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. కేశారంలో ఉపాధి హామీ సిబ్బంది, ప్రజలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు పనులకు హాజరుకావాలని సూచించారు. కూలీలు అధిక సంఖ్యలో వచ్చి వారి పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి పనులను ఉదయం వేళలో కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకృష్ణ

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు



సిరికొండ: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి వార్షిక ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. సంఘం సభ్యులు డప్పు వాయిద్యాలు, మంగళ హారతులతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం అధ్యక్షుడు హన్మగౌడ్, రాజేందర్‌గౌడ్, రాజగణేష్ గౌడ్, రామస్వామి గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1: గీతాంజలి మళ్లీ వచ్చింది-10.40 టిల్లు స్క్వేర్(తెలుగు)- 1.30, ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 4.20, 7.30
- స్క్రీన్-2: మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 11.00, గీతాంజలి మళ్లీ వచ్చింది (తెలుగు) - 1.30, 7.35 బడే మియా చోటే మియా (హిందీ)-4.30, 10.25
- స్క్రీన్-3: మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.40, 4.30, 7.40, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1: మైదాన్ (హిందీ)- 9.15, ది ఫ్యామిలీ స్టార్(తెలుగు)- 1.05, 10.30 టిల్లు స్క్వేర్(తెలుగు)- 4.30, 7.30
- స్క్రీన్-2: బడే మియా చోటే మియా- 10.00, 7.05, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ)- 1.30, గీతాంజలి మళ్లీ వచ్చింది - 4.05 బడే మియా చోటే మియా (3డీ హిందీ)- 10.35
- స్క్రీన్-3: లవ్‌గురు(తెలుగు)-10.15, 7.15, మంజుమ్మల్ బాయ్స్- 1.25, 4.20, గీతాంజలి మళ్లీ వచ్చింది -10.25
- స్క్రీన్ -4: మైదాన్ (హిందీ)- 12.00, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు) - 3.50, 6.35, లవ్ గురు (తెలుగు)-10.25

దేవి: టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్: బడే మియా చోటే మియా (హిందీ) - 11.00 6.00, మైదాన్ (హిందీ)- 2.00 6.00
లలితామహల్: ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్: గీతాంజలి మళ్లీ వచ్చింది(తెలుగు)

బీజేపీలో యువకుల చేరిక


పార్టీలో చేరిన యువకులతో ఎంపీ అర్వింద్

మోపాల్: కాల్పోల్ గ్రామానికి చెందిన యువకులు బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ జిల్లా కార్యాలయంలో ఎంపీ అర్వింద్ కాషాయ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అన్నివర్గాల సంక్షేమం కోసం బీజేపీ సంకల్ప పత్రం విడుదల చేసిందని తెలిపారు. యువకులందరూ కష్టపడి పని చేసి నిజామాబాద్ పార్లమెంట్‌లో రెండోసారి కాషాయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కాల్పోల్‌కు చెందిన రవి, అనిల్, నరేందర్, నితిన్, శ్రీహరి, తదితరులు బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మండల అధ్యక్షుడు ద్యాప రవి, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద మహిళలకు రూ.100కే ఓపీ వైద్యం

నిజామాబాద్‌నాగారం: పేద మహిళలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రూ.100కే ఓపీ వైద్యాన్ని అందిస్తున్నట్లు ప్రముఖ గైనకాలజిస్ట్ కవితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని మజూర్ ఛాప్ బీడీ కార్ఖానాను సందర్శించి మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కవితారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసాయి హాస్పిటల్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కవితారెడ్డి హెల్త్ ఫౌండేషన్ ద్వారా రూ.100కే ఓపీ వైద్యం ప్రారంభించామని, దీనికి తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి మహిళా అర్హులన్నారు. గుర్తింపు కార్డు కలిగి ఇన్‌పేషంట్‌గా ఉన్న మహిళలకు ఆస్పత్రి బిల్లులో 50 శాతం రాయితీ


బీడీ కార్మికులతో మాట్లాడుతున్న కవితారెడ్డి

కల్పిస్తున్నామన్నారు. చిన్న పిల్లలకు కూడా రూ.100కే వైద్యం అందిస్తున్నామని, కార్డులు అందని వారు ఆస్పత్రికి వచ్చి వివరాలిస్తే గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండలంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి షేక్ పర్వీన్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 40 సీట్లకు, 7వ తరగతిలో ఖాళీగా ఉన్న 10 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, టీసీ, బోనాఫైడ్, జనన ధ్రువపత్రం, కుల, ఆదాయ, ఆరోగ్య ధృవీకరణ పత్రాలతో పాటు నాలుగు పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో పాఠశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

22 నుంచి వేసవి సంగీత తరగతులు

నిజామాబాద్ సిటీ: డీకే మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మే 31 వరకు వేసవికాలం సంగీత తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ మాస్టార్ దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు.ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి ఏడు గంటల వరకు అన్ని వయస్సుల వారికి తరగతులు ఉంటాయని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు నగరంలోని గంగస్థాన్ ఫేజ్–2, రోడ్ నెంబర్–5 సుదర్శన్ రావు అపార్టుమెంట్‌లో జరుగుతాయని, వివరాలకు 84640 32683, 94400 23331.

నేటి నుంచి ఆలయంలో ఉత్సవాలు

సిరికొండ: మండల కేంద్రంలోని శేషసాయి లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో 61వ వార్షికోత్సవాలను బుధవారం(నేడు) నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	76,600	వెండి (కిలో)	88,500
22 క్యారెట్స్	70,670		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	35	60	పచ్చిమిర్చి	50	70
బీరకాయ	45	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	35	60
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	35	60	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	45	60
పుదీనా	35	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

లో వోల్టేజ్ అధిగమించేందుకు..

నిజామాబాద్‌నాగారం: ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్తింగ్ కోసం నీరు తప్పనిసరిగా ఉండాలి. వేసవి కావడంతో భూమిలో నీరు పూర్తిగా ఇంకిపోయి లోఓల్టేజ్ సమస్య వస్తుంది. తరుచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు మంగళవారం టౌన్–3 పరిధిలో కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ సహకారంతో


విద్యుత్ అధికారులు మున్సిపల్ ట్యాంకర్లతో నీళ్లు పోయించారు.

పంచలోహ విగ్రహాల అందజేత

నిజామాబాద్ సిటీ: నగరంలోని హమల్‌వాడి శ్రీ సాయిబాబా ఆలయం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు, సీతారామ కల్యాణం కోసం స్థానిక భక్తులు పరిమళ, నాగరాజులు సీతారామ దర్బార్ పంచలోహ విగ్రహాలను అందజేశారు. సోమవారం ఆలయకమిటీ చైర్మన్ మదాని శ్రీధర్ గుప్తా ఈ విగ్రహాలను అందుకున్నారు. శ్రీ రామ నవమి రోజు ఈ విగ్రహాలకు కల్యాణం జరిపించనున్నారు.



వీర హనుమాన్ విజయయాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: ఇందూరు నగరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో హనుమాన్ బ్రహ్మోత్సవం సందర్భంగా వీర హనుమాన్ విజయ యాత్రకు సంబంధించి మంగళవారం వీర హనుమాన్ విజయ యాత్ర ప్రచార మాధ్యమాలు ఆటో స్టిక్కర్స్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ విభాగ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షులు దినేష్ ఠాకూర్ మాట్లాడుతూ.. 23న నీలకంఠేశ్వరుని ఆలయం నుంచి ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై సాయంత్రం ఆరున్నర గంటల తర్వాత భారీ బహిరంగ సభతో ఆర్ఆర్ చౌరస్తాలో యాత్ర ముగుస్తుందన్నారు. యాత్రలో హిందూ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు అరుణ్ రెడ్డి, హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షులు బినయ్, శైలేష్, శివాజీ యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ రావు, తదితరులున్నారు.